క్లుప్తంగా

'నీటి తొట్టెల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు'


మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయి స్వామి

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి మంజూరైన పశువుల నీటి తొట్టెలు నిర్మించడంలో నిర్లక్ష్యం వీడి గడువులోపు నిర్మాణాలు పూర్తి చేయించాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రోజూ ఎంత మంది కూలీలు పనులకు వస్తున్నారని ఆరా తీశారు. ఇచ్చిన టార్గెట్ మేరకు కూలీలకు పనులు కల్పించాలన్నారు. పనులు చేసిన వెంటనే కొలతలు తీసుకుని బిల్లుకు పెట్టాలని సూచించారు. నిబంధలనల మేరకు పనులు నాణ్యతగా చేసేలా కూలీలకు అవగాహన కలిప్చంచి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏఓ కేశవ, పీఆర్ ఏఈ రమణయ్య, ఏపీఓ పోలేరయ్య, ఇంజినీర్ రాజేష్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న చలో విజయవాడ

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యోగల సమస్యలపై జూన్ 5న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు నాగరాజు తెలియజేశారు. బుధవారం పట్టణంలోని తాహసీల్దార్ కార్యాలయం ఎదుట చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 10 వేల మందితో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్డీటీ లేకపోతే పేదలకు కష్టాలు తప్పవు


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

శెట్టూరు: జిల్లాలో ఆర్డీటీ సంస్థ లేకపోతే పేదలకు కష్టాలు తప్పవని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో భాగంగా మూడో రోజూ రిలే నిరహార దీక్ష కొనసాగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దీక్షకు మద్దతు పలికారు. అనంతరం ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కోరుతూ తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి వినతి పత్రం సమర్పించారు. సంస్థ కార్యకాలాపాలు యథావిధిగా జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయ్యగార్లపల్లి, బసంపల్లి, శెట్టూరు గ్రామస్తులు దీక్షలో కూర్చున్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు రాయదుర్గం గోవిందు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, మాజీ సర్పంచ్ బాబురావు, దళిత నాయకులు టైలర్ వన్నూరుస్వామి, లింగప్ప, నాయకులు రఘు, దేవీలాల్, పీల్ తిప్పేస్వామి, రామలింగ, మల్లయ్య, మూర్తి, మైలారి, మారెప్ప, మాలింగ, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


చామంతి జ్యోతి (ఫైల్)

బెళుగుప్ప: మండల పరిధిలోని హనిమరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చామంతి జ్యోతి రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. ఈనెల 27వ తేదీన చామంతి జ్యోతి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో రెండు రోజులుగా బంధువులు, చుట్టు ప్రక్కల గ్రామాల్లోనూ ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని జ్యోతి మామ క్రిష్టప్ప తెలిపాడు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

అవగాహనతోనే ఎయిడ్స్‌కు చెక్


వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రీడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని ఉద్దేహాళ్‌లోని ఉలిగమ్మ దేవాలయం వద్ద జంగం శ్రీనివాసులు కళా బృందం ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంలు శశికళ, వరలక్ష్మీ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో జోరుగా పేకాట



- చక్రం తిప్పుతున్న టీడీపీ నాయకులు
- పట్టించుకోని పోలీసులు

గుమ్మఘట్ట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఓ వైపు ఇసుక, మట్టితో పాటు సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. మరోవైపు పేకాట, మట్కాలను తమ్ముళ్లే దగ్గరుండి నడిపిస్తున్నారన్న విమర్శలున్నాయి.

జూద కేంద్రాలుగా గ్రామాలు

ముఖ్యంగా గుమ్మఘట్ట మండలంలోని రంగసముద్రం, గలగల, సిరిగెదొడ్డి, చెరువుదొడ్డి, ఎర్రంపల్లి తదితర గ్రామాల్లో పేకాట కేంద్రాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అలాగే రాయదుర్గం మండలంలోని డి.కొండాపురం, కెంచానపల్లి, జుంజురాంపల్లి తదితర గ్రామాల సమీపాల్లో జోరుగా గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. కొందరు టీడీపీ నాయకులు దగ్గరుండి జూదాన్ని నడిపిస్తున్నట్లు ప్రజలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

స్థావరాలను మారుస్తూ...

పేకాట స్థావరాలను నిత్యం మారుస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పోలీసుల పాత్ర ఉన్నట్లు తెలిసింది. పేకాట స్థావరాల గురించి పోలీసులకు తెలిసినా దాడులు నిర్వహించేందుకు సాహసించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించకుండ ఉండేందుకు ప్రతి నెలా మామూళ్లు అందుకుంటున్నారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేకాట రాయుళ్ల ఆటకు అడ్డు అదుపు లేకుండా పోయిందంటున్నారు. సంపాదించిన మొత్తం డబ్బు జూదానికే సరిపోతుండటంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డదారిలో రూ.7 లక్షల దోపిడీ

ఇటీవల పూలకుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేకాటలో రూ.7 లక్షలు గెలుచున్నాడని, ఆ వెంటనే పోలీసులను రంగ ప్రవేశం చేయించి ఆ వ్యక్తి నుంచి నగదును కాజేశారన్న వార్త చర్చనీయాంశమైంది. కేసు లేకుండా డబ్బును ప్రభుత్వానికి అప్పజెప్పకుండా అడ్డదారిలో స్వాహా చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టి పేకాటపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై రూరల్ సీఐ వెంకటరమణను వివరణ కోరగా ప్రస్తుతం తాను బందోబస్తులో ఉన్నానని, వచ్చిన తరువాత పేకాట స్థావరాలపై భరతం పడతామని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

కూడేరు: బాలికలు బాగా చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సీడీపీఓ శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని బ్రాహ్మణ పల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో ఆరో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం ఆధ్వర్యంలో సీఏటీసీ-1 ఎన్‌సీసీ శిక్షణ తరగతుల్లో 500 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో క్యాడెట్లకు 'బాల్య వివాహాలు ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసుకుంటే బంగారు భవిష్యత్ నాశనమవడమే కాకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలియజేశారు. ఎక్కడైన బాల్య వివాహాలు చేస్తుంటే 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ, లెఫ్టినెంట్ ఎస్.పావని, మేజర్ బల్‌బీర్ సింగ్, జేసీఓలు కైలాస్‌బంకర్, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు నవీన్ కుమార్,ఎం.ఎండీ ముదస్సర్ , ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో విజ్ఞానం పెంపొందించడమే లక్ష్యం


పిల్లలు గీసిన బొమ్మలను చూపుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

కూడేరు: వేసవి సెలవుల్లో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా వారిలో విజ్ఞానం, తెలివితేటలను పెంపొందించాలన్న లక్ష్యంతోనే గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయాధికారిణి రాధారాణి పిల్లలకు ఏర్పాటు చేసిన డ్రాయింగ్, చిత్రలేఖనం పోటీలను పరిశీలించారు. సమ్మర్ క్యాంపును పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. గ్రంథాలయంలో అన్ని రకాల విలువైన పుస్తకాలలు అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని పిల్లలకు తెలియజేశారు. సమ్మర్ క్యాంపుల్లో భాగంగా పిల్లలతో ఆటలు ఆడించడం, పాటలు పాడించడం చేస్తున్నామన్నారు. తద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం జరుగుతుందన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందిజేస్తామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


బొమ్మనహాళ్: యోగా చేస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ యోగా చేయడం దినచర్యగా మార్చుకోవాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ మునివేలు తెలిపారు. బుధవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించి మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. శారీరక, మానసిక ఉల్లాసం కోసం , ఆరోగ్యం కోసం, ప్రతి రోజూ యోగా చేయాలన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు, పరుగుల జీవితాలను సాగిస్తూ రోగాల బారిన పడుతున్నారన్నారు. అదే యోగా చేస్తే చదువులో ఏకాగ్రత పెరగడంతో పాటు ఎలాంటి రోగాలు దరి చేరవని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, సర్వేయర్ రవితేజ, హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్, ఆర్‌ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ రూరల్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీఓ రవిప్రసాద్, అర్బన్ సీఐ మహానంది తెలిపారు. బుధవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి అధికారులు, విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, అర్బన్ సీఐ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగా అవశ్యకతను వివరిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవన శైలిలో మార్పు తెచ్చేలా యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈశ్వరప్ప, ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, వివిధ కార్యాలయాల సిబ్బంది, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

రోప్ వే ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కోట అభివృద్ధి చెందాలంటే రోప్ వే ఏర్పాటు చేయడంతో పాటు హరిత హోటల్‌ను ఏర్పాటు చేయించాలని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. గుత్తి కోటలో సర్ థామస్ మన్రో జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కోటలో శిథిలావస్థకు చేరుకున్న అన్ని కట్టడాలను పునర్ నిర్మించాలన్నారు. గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షులు కాశీరావు, సభ్యులు కోటేశ్వర రావు, దేవేంద్ర, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొన్న ఆటో

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో కోళ్ల ఫారం వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కుళ్లాయి స్వామి రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుళ్లాయి స్వామిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మట్కా బీటర్ల అరెస్ట్

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మట్కా రాస్తున్న అవినాష్, రామును బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొద్ది రోజులుగా చేనేత కాలనీ సమీపంలో మట్కా రాస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. బీటర్ల నుంచి చీటీలు, రూ.16,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో భాగంగా అనంతపురం జిల్లా ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాలో అనేక తప్పిదాలు జరిగాయన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..ఇప్పటిదాకా సవరణలు జరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలసిన వారిలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీరాములు, హరి ప్రసాద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏటీఎం ఉన్నా.. సేవలు సున్నా


కూడేరు ఎస్సీ కాలనీ ఎదుట ఏడాదిగా మూతబడిన ఏటీఎం సెంటర్

కూడేరు: మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ పెరిగిపోయింది. నగదు డిపాజిట్, విత్‌డ్రాలు బ్యాంకులకు వెళ్లకుండా ఏటీఎం సెంటర్లలోని మిషన్ల ద్వారానే చేసుకునే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఏ సమయంలోనైనా రూ.100 కావాలన్నా ఏటీఎం సెంటర్లలో డ్రా చేసుకోవచ్చు. కానీ ఏటీఎం సెంటర్లు తెరుచుకోకపోయినా, అందులో మిషన్లు సక్రమంగా పని చేయకపోయినా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం మండల కేంద్రం కూడేరులో అదే జరుగుతోంది. స్టేట్ బ్యాంక్ ముందు భాగంలో ఒకటి, ఎస్సీ కాలనీ ఎదుట మరొక ఏటీఎం సెంటర్లను ఏర్పాటు చేశారు. 2024 జూన్ 8 రాత్రి ఎస్సీ కాలనీ ఎదుట ఉన్న ఏటీఎం సెంటర్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. మిషన్‌ను ధ్వంసం చేసి రూ.18 లక్షలు ఎత్తుకెళ్లారు. నాటి నుంచి నేటి వరకు ఆ సెంటర్ తెరచుకోలేదు. తెరిచే దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. స్టేట్ బ్యాంక్ వద్ద ఉన్న సెంటర్‌లో మిషన్ వినియోగం అధికమవడంతో సాంకేతిక లోపం తలెత్తి డబ్బులు డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు వస్తున్నాయి. కానీ డబ్బులు మాత్రం బయటకు రావడం లేదు. ఆలస్యంగా డబ్బులు ఖాతాలోకి జమ అయినట్టు మెసేజ్‌లు అందుతున్నాయి. గత రెండు నెలలుగా వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికై నా స్పందించి మూతబడిన ఏటీఎం సెంటర్‌ను తెరవాలని స్థానికులు కోరతున్నారు. అలాగే ప్రస్తుతం వినియోగంలో ఉన్న మిషన్‌కు మరమ్మతులు చేపట్టాలని సూచిస్తున్నారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన


యర్రగుంట వద్ద పనులను పరిశీలిస్తున్న అధికారులు

కణేకల్లు: హెచ్చెల్సీ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు బుధవారం పరిశీలించారు. యర్రగుంట శివారులో 137 కిలోమీటర్ వద్ద జరుగుతున్న యూటీ (అండర్ టన్నెల్) పనులతో పాటు బొమ్మనహాళ్ మండలంలో 115 నుంచి 130 కిలోమీటర్ మధ్య జరుగుతున్న హెచ్చెల్సీ లైనింగ్ పనులను క్వాలిటీ కంట్రోల్ ఈఈ రమేష్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్, జేఈలు ఓబుళపతి, రమణరెడ్డిలు పరిశీలించారు. 115, 117, 155, 169 కిలోమీటర్ వద్ద జరుగుతున్న డీఎల్‌ఆర్‌బీ (బ్రిడ్జి) పనులను పర్యవేక్షించారు. కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్, మోపిడి వద్ద ఎంపీఆర్, పీఏబీఆర్ రెగ్యులేటర్ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు.

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) లైనింగ్, వంతెన పనులు నాణ్యతగా ఉండాలని అనంతపురం క్వాలిటీ కంట్రోల్ ఈఈ రమేష్, డీఈఈ చంద్రశేఖర్ అన్నారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలోని బొమ్మనహాళ్‌లో హెచ్చెల్సీ కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో నాణ్యతను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండాలని క్వాలిటీ లేకపోతే చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ జేఈఈ రమాణారెడ్డి, ఓబులపతి, హెచ్చెల్సీ జేఈఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటరమణ

పెద్దపప్పూరు: విద్యుత్ స్తంభాల మీదుగా లాగిన టీవీ కేబుల్‌కు విద్యుత్ సరఫరా కావడంతో వెంకటరమణ అనే యువకుడు గాయాల పాలయ్యాడు. వివరాలు.. మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన వెంకటరమణ పశుసంవర్థక శాఖలో గోపాల మిత్రగా పని చేస్తున్నాడు. బుధవారం తన పని ముగించుకుని పొలానికి బయలుదేరాడు. చాగల్లు-పెద్దపప్పూరు రోడ్డు మార్గంలోని గోదాం వద్ద టీవీ కేబుల్ తలకు అందే ఎత్తులో ఉండటంతో తొలుత ఆ కేబుల్‌ను దాటుకుని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ కేబుల్‌కు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో వెంకటరమణ చేతులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ నరసింహులును సంప్రదించగా.. టీవీ కేబుల్‌కు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడం వల్లే ఈ ఘటన జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదృష్టవశాత్తూ వెంకటరమణ ప్రాణాలతో బయటపట్టాడని గ్రామస్తులు పేర్కొన్నారు.

4 నుంచి బ్రహ్మోత్సవాలు

అనంతపురం కల్చరల్: తపోవనంలో కొలువుదీరిన శ్రీక్షేత్రం దశమ బ్రహ్మోత్స వేడుకలు వచ్చే నెల 4 నుంచి 6 వరకు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మాజీ సలహాదారు (ఎండోమెంటు) జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. వేడుకల పోస్టర్లను బుధవారం రాత్రి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ 4న ధ్వజారోహణం, దివ్యప్రబంధ పారాయణం, నవకళశ స్నాపనం, సుదర్శన హోమం, దీపోత్సవం, 5న శ్రీవారి కల్యాణోత్సవం , గరుడోత్సవం, నగరోత్సవాలు, 6న ధ్వజ అవరోహణం, వసంతోత్సవం, నిరాటోత్సవంతో పాటు ద్వాదశ కలశారాధన జరుగుతాయన్నారు. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. శ్రీలక్ష్మీ హయగ్రీవ శ్రీవేంకటేశ్వర, శ్రీగోదారంగనాథస్వామి ఆలయంలో ఏటా బ్రహ్మోత్సవాలను జిల్లా శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీక్షేత్రం ప్రతినిధులు అంబాళం రఘు, రవి, రాఘవేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నరసింహ స్వామి కల్యాణం


అలంకరణలో నవ అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన నవ అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈనెల 30న శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో వేకువజాము నుంచి స్వామికి అభిషేకాలు, అర్చనలు, మండల పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవానికి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని సూచించారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి తదితరులు

వజ్రకరూరు: కిశోర బాలికలు మూఢనమ్మకాలు వీడి జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని కొనకొండ్ల గ్రామంలో రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని కిశోర బాలికలతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడారు. రుతుస్రావం సమయంలో పరిశుభ్రత చాలా అవసరమన్నారు. కిశోర బాలికలు ప్యాడ్స్, బట్టలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో గర్భాశయ కేన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. రుతుక్రమ సమయంలో ఆహార నియమాలు ఏమీ ఉండవని.. అన్ని ఆహార పదార్థాలు తీసుకోవచ్చన్నారు. పోషక విలువలు కలిగిన పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ యల్లమ్మ, సూపర్‌వైజర్ పద్మావతి, మహిళాపోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌లో తనిఖీ


ఉద్దేహాళ్‌లోని తాజ్ పిక్చర్ ప్యాలెస్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: ఎగ్జిబిటర్లు సినిమా థియేటర్లను బంద్ చేయనున్నారనే సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సినిమా థియేటర్‌లో అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ రామ్ ఆధ్వర్యంలో బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలోని తాజ్ పిక్చర్ ప్యాలెస్ సినిమా థియేటర్‌లో అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. నిర్వహణ, థియేటర్లలో ఆహార, పానీయాల నాణ్యత, ధరలు, పరిశుభ్రత, తదితర అంశాలపై తనిఖీలు చేపట్టినట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. తనిఖీలు నిర్వహించిన అనంతరం వివరాలు నమోదు చేశారు.

ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: మాజీ ముఖ్యమంత్రి, నందమూరి తారక రామారావు జయంతిని బుధవారం స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఎస్‌ఐ నబీరసూల్ , డీటీ శ్యామ్‌రాయ్, ఎంఈఓ మల్లికార్జున, ఆర్‌ఐ బాలకృష్ణ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


మంగలి మహేష్ (ఫైల్)

బెళుగుప్ప: మండల పరిధిలోని శీర్పి గ్రామానికి చెందిన తన భర్త మంగలి మహేష్ ఈనెల 20 నుంచి కనిపించడం లేదని భార్య రూప బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్రాప్ లోన్ రెన్యూవల్ కోసం కళ్యాణదుర్గం వెళ్లిన మహేష్.. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు ప్రక్కల గ్రామాలు, బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బాల నరసింహులు కేసు నమోదు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం మాజీ ఎంపీ రంగయ్య చేపట్టిన పాదయాత్రపై చర్చిస్తామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితం

వజ్రకరూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితమని వజ్రకరూరు వైద్యాధికారి తేజశ్వి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వజ్రకరూరులోని 1వ వార్డుకు చెందిన కృపా అనే మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పురిటి నొప్పులతో ఉదయం ఆసుపత్రికి చేరుకున్న ఆమెకు ఆసుపత్రి వైద్యులు దగ్గరుండి సురక్షితంగా కాన్పు చేశారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సర్పంచ్ మోనాలిసా ఆసుపత్రికి చేరుకుని తల్లీబిడ్డను చూసి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. సురక్షిత ప్రసవం చేసిన వైద్యులు సిబ్బందిని అభినందించారు.